
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



సోమశిలలో 60.716 టీఎంసీలు

జలాశయంలో శనివారానికి 60.716 టీఎం సీలు ఉన్నాయి. 21,078 క్యూసెక్కుల వరద వస్తోంది. కండలేరుకు 10,850 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,06,740
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,620
3 శాతం జీఎస్టీతో	రూ.9,909
నవర (8 గ్రా)	రూ.79,272

గరిష్టం/కనిష్టం
37.0 /27.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం అక్కడక్కడ మేఘావృతంగా ఉండి, ఉరుములు, మెరుపుల వాతావరణం ఉంటుంది. శనివారం గాలిలో తేమ 65 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పోలీసు అదుపులో ఐదుగురు రౌడీషీటర్లు

- పరారీలోని ఇద్దరి కోసం గాలింపు

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని లేపేస్తే డబ్బేడబ్బు అంటూ కొందరు మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన విషయం విదితమే. దీనిపై ప్రత్యేక బృందాలు లోతుగా విచారిస్తున్నాయి. రెండు నెలల కిందట మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో ఈ వీడియో తీసినట్లు, ఆ సమయంలో లాడ్జిలో రౌడీషీటర్లు జగదీష్, రాజారెడ్డి, జాకీర్‌తో పాటు మహేష్, వినీత్, ఫైరోజ్, సాయి ఉన్నారని పోలీసులు గుర్తించారు. వీరిలో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. జగదీష్ ఇప్పటికే జైల్లో ఉండగా, పరారీలో ఉన్న మిగిలిన ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మరో వైపు ఈ విషయమై పోలీసు కస్టడీలో ఉన్న అరుణను సైతం పోలీసు అధికారులు విచారించినట్లు తెలిసింది.

జిల్లాలో 30 పోలీసు యాక్ట్ అమలు

నెల్లూరు (క్రైమ్): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలో ఏపీ 30 పోలీసు యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు ఎస్పీ జి. కృష్ణకాంత్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజా సంఘాలు, యూనియన్లు, రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలంటే ముందస్తుగా స్థానిక పోలీసు అధికారి నుంచి అనుమతి పొందాలన్నారు. అనుమతులు లేకుండా మీటింగ్‌లు, ర్యాలీలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని చెప్పారు.

నేను ఇలాంటి బెదిరింపులకు భయపడను

- నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు సిటీ: నేను రౌడీషీటర్ల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, విద్యార్థి నేతగా ఉన్న సమయంలోనే రౌడీలను ఉరికించి ఉరికించి తరిమికొట్టిన చరిత్ర నాదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మాగుంట లేవుట్లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కోటంరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హుందా రాజకీయాలకు చిరునామా అయిన నెల్లూరులో రౌడీషీటర్లు నన్ను చంపేయాలని అందరూ మాట్లాడుకున్నారని తెలిపారు. నన్ను చంపేందుకు ఎవరు వారికి డబ్బు ఇస్తామన్నారని, ఒక పోరుడిగా నేను అడుగుతున్నానన్నారు. ఎస్పీ మూడు రోజుల ముందు నుంచే మా నోటీసులో ఉందని చెప్పారని, కనీసం నాకు సమాచారం ఇవ్వలేదని, జాగ్రత్త కూడా చెప్పలేదన్నారు. ఈ విషయం పోలీసుల విచారణలో తేల్చాలని డిమాండ్ చేశారు. నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నాపై కుట్ర చేశారంటూ వైఎస్సార్‌సీపీ ప్రచారం చేసిందన్నారు. ఇటువంటి సంప్రదాయం మా కుటుంబంలో లేదన్నారు.

6న గిరిజన ప్రత్యేక పీజీఆర్ఎస్

నెల్లూరురూరల్: జిల్లాలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 6న కందుకూరు సబ్ కలెక్టర్, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు శనివారం కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచనల మేరకు గిరిజనుల కోసం ప్రత్యేకంగా డివిజన్ స్థాయిలో పీజీఆర్ఎస్ ఏర్పాటు చేస్తున్న ట్లు తెలిపారు. గిరిజనుల సమస్యలను స్వీకరించి పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.

అవినీతి అధికారి హైడ్రామా

గిరిజన సబ్ రిజిస్ట్రార్‌కు ఘోర అవమానం

- కోవూరు ఎస్ఆర్ఓగా బదిలీపై వచ్చిన అధికారి
- ఆయన్ను బాధ్యతలు తీసుకోనివ్వకుండా అడ్డుకున్న ఇన్‌చార్జి ఎస్ఆర్ఓ
- రంగంలోకి దిగిన సబ్ రిజిస్ట్రార్ల సంఘ నేతలు
- సదరు శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వైనం
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ తరఫున రాయబారం
- డీఆర్వో బాలాంజనేయులు వచ్చి ఇన్‌చార్జికి మందలింపు
- దాదాపు మూడు గంటల అనంతరం విధుల్లో చేరిక
- మరో సామాజిక వర్గానికి చెందిన వారైతే ఇలాగే చేస్తారా?
- గిరిజన సంఘ నాయకుల ఆవేదన



ఇన్‌చార్జి ఎస్ఆర్ఓకు ఆర్డర్ చూపిస్తున్న ఎస్ఆర్ఓ పులి పెంచలయ్య

కోవూరు : సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతిపై వచ్చిన గిరిజన సామాజిక వర్గానికి చెందిన అధికారిని విధుల్లో చేరనీయకుండా ఆ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న అగ్రకులస్తుడైన ఇన్‌చార్జి అధికారి అడ్డుకోవడంతో దాదాపు మూడు గంటల పాటు హైడ్రామా నడిచింది. ఈ ఘటన శనివారం కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగింది. ఓ గిరిజన అధికారికి ఘోర అవమానం జరగడంపై గిరిజన సంఘాలు సైతం అక్కడికి చేరుకోవడంతో గందరగోళం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. కోవూరు ఎస్ఆర్ఓలో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ అధికారి నియామకం జరగలేదు. దీంతో సదరు శాఖ ఉన్నతాధికారులు అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉదయగిరి శ్రీనివాసులును ఇన్‌చార్జి ఎస్ఆర్ఓగా నియమించారు. లంచాలకు, అవినీతికి బాగా అలవాటు పడిన సదరు ఇన్‌చార్జి అధికారి ఇక్కడికి రెగ్యులర్ ఎస్ఆర్ఓను రానివ్వకుండా ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పులి పెంచలయ్యకు సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతి కల్పించి కోవూరు ఎస్ఆర్ఓకు బదిలీ చేసింది. శనివారం ఆయన బాధ్యతలు తీసుకునేందుకు ఎస్ఆర్ఓకు రాగా ఆయన్ను విధులు చేరనివ్వకుండా ఇన్‌చార్జి అధికారి అడ్డుకున్నారు.



ఇన్‌చార్జి ఎస్ఆర్ఓ ఉదయగిరి శ్రీనివాసులును మందలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు

మూడు గంటల పాటు హైడ్రామా

ఉదయం కార్యాలయానికి చేరుకున్న పెంచలయ్య అధికారిగా జాయిన్ అయ్యేందుకు రాగా ఇన్‌చార్జి ఎస్ఆర్వో (సీనియర్ అసిస్టెంట్) శ్రీనివాసులు అడ్డుపడుతూ వాగ్వాదానికి దిగారు. నాకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయని, నేనే ఇక్కడ కొనసాగుతానంటూ అవమానించారు. నువ్వు జాయిన్ అయి వెంటనే సెలవు పెట్టి వెళ్లిపోతాను అంటేనే నేను అనుమతిస్తాను.. లేదంటే జాయిన్ కానివ్వనంటూ బహిరంగంగా హెచ్చరించారు. దీంతో ఈ విషయాన్ని రెగ్యులర్ ఎస్ఆర్ఓ జిల్లా సబ్ రిజిస్ట్రార్ల సంఘ నేతల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన వారు జిల్లా రిజిస్ట్రార్‌కు, సదరు శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సైతం స్థానిక ఎమ్మెల్యేకు ఫోన్ చేసి విషయం తెలియజేయడంతో ఆ విషయం తనకు తెలియదంటూ చెప్పడం గమనార్హం. వెంటనే తన ముఖ్య అనుచరులను ఎస్ఆర్ఓకు పంపించి అతన్ని విధుల్లో చేర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇదే సమయంలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ బాలాంజనేయులు సైతం అక్కడికి చేరుకుని ఇన్‌చార్జి ఎస్ఆర్ఓగా ఉన్న సీనియర్ అసిస్టెంట్‌ను మందలించారు. అప్పటికే గిరిజన సంఘాల నేతలు సైతం రెగ్యులర్ ఎస్ఆర్ఓకు మద్దతుగా అక్కడికి చేరుకోవడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. దాదాపు మూడు గంటల హైడ్రామా అనంతరం రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌కు బాధ్యతలు అప్పగించారు.

> **గిరిజనులంటే చిన్నచూపా**
>
> ఒక గిరిజన బిడ్డ కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయి అధికారిగా ఎదిగితే కోవూరు ఇన్‌చార్జి ఎస్ఆర్ఓ ఉదయగిరి శ్రీనివాసులు అది చూసి ఓర్వలేకపోయారు. ఉద్యోగోన్నతిపై కోవూరు సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన పులి పెంచలయ్య విషయంలో వ్యవహరించిన తీరు గర్హనీయం. ఈ పరిణామం గిరిజనులను అవమానించినట్లేగా అనిపిస్తోంది.
>
> – చౌటూరు శీనయ్య గిరిజన నాయకుడు, మాజీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు

డీఆర్వో మందలింపు..

కోవూరు ఎస్ఆర్ఓలో పరిస్థితి తెలుసుకున్న జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఇక్కడికి చేరుకుని ఇన్‌చార్జి ఎస్ఆర్ఓ (సీనియర్ అసిస్టెంట్‌ను) శ్రీనివాసులను నిలదీశారు. 'ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా నీ ఇష్టం వచ్చినట్టు వ్యవహరించడం తగదు. ఇదే పరిస్థితి నీకు ఎదురైతే ఎలా ఉంటుందో ఆలోచించుకో' అంటూ ఆయన తీవ్ర స్థాయిలో మందలించారు.

గిరిజన సంఘాల నేతల రచ్చ

గిరిజన సామాజిక వర్గానికి చెందిన పులి పెంచలయ్య ఎస్ఆర్ఓగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన కోవూరు ఎస్ఆర్ఓగా నియమితులు కావాల్సి ఉండడంతో ఇన్‌చార్జి ఎస్ఆర్ఓ అడ్డుపడడంపై గిరిజన సంఘ నేతలు విషయం తెలుసుకుని ఇక్కడికి చేరుకున్నారు. శ్రీనివాసులు వ్యవహారంపై మండిపడ్డారు. అదే మరో సామాజిక వర్గ అధికారి అయితే ఇలానే చేస్తారంటూ రచ్చ చేశారు. ఇంతకాలం శ్రీనివాసులు అధికార పార్టీ అండదండలతో ఆధిపత్యం చెలాయిస్తున్నారని, దీంతో ఆయన్ను ఎవరూ ఎదురించలేకపోతున్నారని డాక్యుమెంట్ రైటర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ పనుల కోసం వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం, విభాగాధికారులను బెదిరించడం, ఇటీవల కొందరిపై తప్పుడు కేసులు పెట్టడం వంటి ఘటనలు జరిగినట్లు చెబుతున్నారు. ఇలాంటి అవినీతి పరుడిని కోవూరు నుంచి బదిలీ చేయాలని పలువురు డాక్యుమెంట్ రైటర్లు, స్థానిక వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

> **ఆదాయ వనరులను వదులుకోలేక..**
>
> కోవూరు ఎస్ఆర్ఓలోని సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉదయగిరి శ్రీనివాసులుకు అనివార్య పరిస్థితుల్లో ఇన్‌చార్జి ఎస్ఆర్ఓగా నియమితులయ్యారు. జిల్లాలో కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వ్యక్తిగత ఆదాయపరంగా ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా ఉండటంతోపాటు, మామూళ్లు సైతం బాగానే వస్తాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్ఆర్ఓగా అనేక రకాలుగా ఆదాయాలు ఉండడంతో ఆ పోస్టు నుంచి తప్పుకోవడానికి ఇష్టపడని సదరు సీనియర్ అసిస్టెంట్ అప్పటి నుంచి ఎవరైనా ఇక్కడ విధులు నిర్వర్తించేందుకు వచ్చే అధికారులను అడ్డుకోవడం, లేదంటే బాధ్యతలు తీసుకున్న వారిపై ఆరోపణలు గుప్పించి బదిలీ చేయించడం జరుగుతూ వస్తోంది. కార్యాలయం మరమ్మతుల పేరిట రూ.లక్షల్లో దండుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులను కూడా తన గుప్పెట్లో పెట్టుకొని వారికి భారీ మొత్తాలను అందజేస్తూ, తానే ఇక్కడ కొనసాగాలని ఉదయగిరి శ్రీనివాసులు పావులు ఇంత కాలం వ్యవహరిస్తూ వచ్చారు. తాజా పరిణామాల నేపథ్యంలో అతని ఆధిపత్యానికి గండి పడింది.

రైతుకు యూరియా ఇవ్వలేని విజనరీ చంద్రబాబు

- రాష్ట్రంలో వ్యవసాయాన్ని గాలికొదిలేశారు
- వ్యవసాయం దండగనే మనస్తత్వం ఆయనది
- కమీషన్లు దండుకునే పనిలో ఆ శాఖ మంత్రి నిమగ్నం
- కూటమి సర్కార్‌పై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీఎం చంద్రబాబు వ్యవసాయాన్ని పూర్తిగా గాలికొదిలేశారని, రైతు సమస్యలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కనీసం రైతులకు సరిపడినంత యూరియాను కూడా అందించలేని అసమర్థ పాలనను చంద్రబాబు కొనసాగిస్తున్నాడని, ఆయనొక విజనరీ అంటూ ఎద్దేవా చేశారు. వ్యవసాయశాఖ మంత్రి చూస్తే అధికారులను అడ్డం పెట్టుకుని కమీషన్లు దండుకునే పనిలో తీరిక లేకుండా ఉన్నారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. ఒక వైపు పంటలకు యూరియా దొరక్క అవస్థలు, మరో వైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేని దుస్థితి ఉందన్నారు. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో ప్రభుత్వం అనేది ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణ కింద రైతులు ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు కొనుగోలు చేస్తే 40 శాతం సబ్సిడీని వారి ఖాతాల్లో మా ప్రభుత్వం పారదర్శకంగా జమ చేసిందన్నారు. ఆర్‌బీకేల ద్వారా విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలబడ్డామన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రి అధికారులను కమీషన్ ఏజెంట్లుగా మార్చేశాడని దుయ్యబట్టారు. నెల్లూరులో పంట కోతకొచ్చినా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయమని ప్రభుత్వం ఇంతవరకు అధికారులకు చెప్పలేదు. పుట్టి ధాన్యం రూ.19,770 ఉంటే.. దళారులు రూ.15 వేలకే కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు.

ఉల్లి రైతులను పట్టించుకోరా?

కర్నూలు జిల్లాలో ఉల్లి రైతుల ఆర్తనాదాలు సీఎం చంద్రబాబుకు వినిపించడం లేదని కాకాణి విమర్శించారు. మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.25 ఉంటే, ఏపీలో మాత్రం రైతుల దగ్గర కేవలం రూ.2 నుంచి రూ.4లకే కొనుగోలు చేస్తున్నారన్నారు. మద్దతు ధర కల్పించే దిశగా చంద్రబాబు ఆలోచన చేయడం లేదు. వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటల వరకు ఏ ఒక్క రైతుకు మేలు జరగడం లేదని, ప్రతిపక్షంగా రైతుల తరఫున రాష్ట్ర వ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా ఉండడం వల్ల రైతులు ధైర్యంగా ఉండేవారన్నారు. మా ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం కూడా చెల్లించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత పంటల బీమా పథకాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. ఇప్పటికైనా రైతు సమస్యలపైన సీఎం చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. పోలవరం ప్రాజెక్టును స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్న వ్యక్తి చంద్రబాబు అని, పోలవరం ప్రాజెక్ట్ జాప్యం కావడానికి చంద్రబాబే కారణమని ఆరోపించారు. చంద్రబాబు చేసిన పాపాలు రైతుల పాలిట శాపాలుగా పరిణమించాయి. గతంలో 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు హంద్రీ నీవా పనులు పూర్తి చేయలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే కుప్పానికి నీళ్లు తెచ్చి ఇచ్చిన చరిత్ర అని ధైర్యంగా చెప్పుకుంటామన్నారు.

మరోసారి ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు



కావలి (జలదంకి): కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి మరోసారి వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నోరు పారేసుకున్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వీరంతా అవినీతిపరులు, తాను సచ్ఛీలుడినంటూ చెప్పుకొచ్చారు. ఎప్పుడో కొన్నేళ్ల క్రితం నిర్మించిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి కాలేజీ, కల్యాణ మండపం, ఇల్లు ఆక్రమించాడంటూ పొంతన లేకుండా మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణిని ఉద్దేశించి 'నీవు చచ్చోడివి.కావలికి రాలేకపోయావు. పోలీసులకు చెప్పి హౌస్ అరెస్ట్ చేయించుకున్నావు. నీకు బొక్కలున్నాయి. వాటిని నీకు విప్పి చూపిస్తా' అభ్యంతరకర భాషలో దూషిస్తూ ఊగిపోయాడు. దొంగతనాలు, మానభంగాలు చేయించావు. మనుషులను చంపించావు. మంత్రి అయ్యేటప్పుడు కోర్టులో ఫైళ్లు దొంగిలించావు. కృష్ణపట్నం పోర్టు నుంచి నీ అవినీతిని బయటకు తీస్తానంటూ నోటికొచ్చినట్లు మాట్లాడాడు. చంద్రశేఖర్‌రెడ్డిని కూడా పరుష పదజాలంతో మాట్లాడాడు. చదువుల తల్లికి ప్రతినిధిగా ఉండే నీవు సంస్కారంగా ఉండాలన్నారు. నీ జీవితం, నీ కథ, నీ ఆస్తులు, నీ మానభంగాలు అన్నీ తెలుసు, 10వ తరగతి, ఇంటర్ పేపర్లలో లీకేజీలతో నీకు సంబంధం ఉందంటూ విమర్శలు గుప్పించారు.

'అన్నవరం' కేసులో మరొకరి అరెస్ట్

జలదంకి: కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి సంబంధించి జలదంకి మండలం అన్నవరంలోని క్వారీలో డ్రోన్లతో హత్యాయత్నంకు ప్రయత్నించారనే కేసులో నిందితుడిగా ఉన్న దామెర్ల శ్రావణ్‌కుమార్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుడిని కావలి కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు.

సిండికేట్ సక్సెస్

- జిల్లాలో 55 బార్లకు నోటిఫికేషన్
- 21 బార్లకే నామమాత్రంగా దరఖాస్తులు
- గత్యంతరం లేక కట్టబెట్టిన వైనం



బార్లకు లక్కీడిప్ తీస్తున్న జేసీ కార్తీక్

నెల్లూరు (క్రైమ్): బార్ల ఏర్పాటు విషయంలో సిండికేట్ వేసిన ప్లాన్ కొంత మేరకు సక్సెస్ అయింది. జిల్లాలో 55 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే మద్యం షాపులు, పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో వ్యాపారాన్ని కోల్పోతున్న బార్ల యజమానులు సిండికేట్‌గా మారారు. అన్ని బార్లకు దరఖాస్తులు రాకుండా కేవలం 21 బార్లకు మాత్రమే దరఖాస్తులు వేశారు. దీంతో గత్యంతరం లేక నిబంధనలు సడలించిన అధికారులు లక్కీడ్రా నిర్వహించి బార్లను కేటాయించారు. సిండికేట్ చర్యలతో ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడింది. జిల్లాలో ఓపెన్ కేటగిరీ కింద 50 బార్లు, గీత కులాలకు సంబంధించి ఐదు బార్లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్లు విడుదల చేశారు. దీంతో బార్లన్నింటిని ఏకపక్షంగా దక్కించుకునేందుకు మద్యం సిండికేట్ రంగంలోకి దిగింది. దరఖాస్తులు దాఖలు చేయకుండా అడ్డుకుంటూ వచ్చింది. మరో వైపు బార్ల విధానంలో తమకు అనుకూలంగా మరిన్ని సడలింపులు, రాయితీలు దక్కించుకోవాలని సిండికేట్లు లక్ష్యంగా పెట్టుకున్నాయి. నూతన బార్‌పాలసీపై వ్యాపారులు అనాసక్తి కనబరుస్తూ దరఖాస్తులు దాఖలు కాకుండా చేశారు. దీంతో ఈ నెల 26న దరఖాస్తుల స్వీకరణ ముగిసే సమయానికి కేవలం ఐదు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రభుత్వం గడువును 29వ తేదీ వరకు పొడిగించింది. అయినప్పటికి దరఖాస్తుల దాఖలు నామమాత్రంగానే మారింది. దీంతో సిండికేట్ కొంత మేర సక్సెస్ అయినట్లు తెలుస్తోంది.

21 దుకాణాలకే దరఖాస్తులు.. లక్కీడ్రా

జిల్లాలో 55 బార్లకు 21 దుకాణాలకు 94 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. నెల్లూరులో 38 బార్లకు 13, కావలిలో ఏడు బార్లకు రెండు, కందుకూరులో మూడు బార్లకు రెండింటికే దరఖాస్తులు వచ్చాయి. గీత కులాలకు సంబంధించి నెల్లూరులో రెండు, కావలి, కందుకూరులో చెరో ఒక బార్‌కు దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన వాటికి దరఖాస్తులు దాఖలు కాలేదు. 21 బార్లకు శనివారం జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ కె.కార్తీక్ లక్కీడిప్ నిర్వహించారు. బార్లు దక్కించుకున్న వ్యాపారులు లైసెన్సు ఫీజులో ఆరో వంతు, బ్యాంకు గ్యారెంటీలు సమర్పించిన అనంతరం ఎక్సైజ్ అధికారులు లైసెన్సులు మంజూరు చేయనున్నారు. దరఖాస్తులు, ప్రాసెసింగ్ ఫీజు రూపేణా రూ.4,79,40,000, తొలి విడత లైసెన్సు ఫీజు రూపేణా రూ.2,21,29,000 మొత్తంగా రూ.7,00,69,000 ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చింది. మిగిలిన బార్లకు ప్రభుత్వం మరో మారు రీ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. లక్కీడిప్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య, ఏసీ పి. దయాసాగర్, డీపీఈఓ ఎ. శ్రీనివాసులునాయుడు, ఏఈఎస్‌లు జే రమేష్, ఆర్. జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటితో కాలపరిమితి ముగింపు

ప్రస్తుతం జిల్లాలోని 47 బార్ల కాల పరిమితి ఆగస్టు 31వ తేదీ ఆదివారం రాత్రితో ముగియనుంది. దీంతో వారం రోజుల ముందు నుంచే బార్ల నిర్వాహకులు మద్యం కొనుగోలును నిలిపివేశారు. ఉన్న అరకొర మద్యంను విక్రయిస్తున్నారు. ఆదివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు వాటన్నింటికి సీల్ వేయనున్నారు.

> **రేపటి నుంచి కొత్తబార్లు**
>
> లాటరీ డ్రాలో నెల్లూరు నగరంలో గెజిట్ సీరియల్ నంబర్ 4, 6, 7, 9,11,12,16, 18, 28, 29, 30, 35, 36, కావలిలో 42, 45, కందుకూరులో 46, 48, గౌడ కులాలలకు సంబంధించి నెల్లూరులో రెండు, కావలి, కందుకూరులో చెరో ఒక బార్‌ను వ్యాపారులు దక్కించుకున్నారు. బార్లు దక్కించుకున్న వారిలో అధికశాతం మంది టీడీపీకి చెందిన వారే. సెప్టెంబర్ ఒకటి నుంచి కొత్త బార్లు ప్రారంభం కానున్నాయి.

క్లుప్తంగా

జెడ్పీలో ఉద్యోగోన్నతులు



ఉద్యోగోన్నతులు పొందిన వారితో ఆనం అరుణమ్మ తదితరులు

నెల్లూరు(పొగతోట): జెడ్పీ పరిధిలో ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తున్న 22 మందికి రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులను కల్పించారు. ఈ క్రమంలో ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ మోహన్‌రావు శనివారం అందజేశారు. కారుణ్య నియామకం ద్వారా ఒకరికి ఉద్యోగం కల్పించారు. కాగా ఉద్యోగోన్నతులకు సహకరించిన చైర్‌పర్సన్, సీఈఓకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్కాకుల పెంచలయ్య, దేవ ప్రసన్నకుమార్ కృతజ్ఞతలను తెలియజేశారు. అధికారులు సుబ్రహ్మణ్యం, ముజీబ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ నేతలు భీమిరెడ్డి, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ లారీ బోల్తా



నెల్లూరు సిటీ: కంటైనర్ లారీ బోల్తాపడిన ఘటన ధనలక్ష్మీపురం వద్ద శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరు నుంచి ముత్తుకూరు వెళ్తున్న కంటైనర్ డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నెల్లూరు(క్రైమ్): నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతి చెందారు. బ్లూ రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, లేత బ్లూ రంగు జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. విషయాన్ని గమనించిన అక్కడి వారు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్ట్

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట వద్ద కారులో తరలిస్తున్న ఆరు కిలోల గంజాయిని బిట్రగుంట పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఇబ్రహీంపేట వద్ద వాహన తనిఖీలను కావలి రూరల్ సీఐ పాపారావు, బిట్రగుంట ఎస్సై ప్రభాకర్ నిర్వహిస్తుండగా, నెల్లూరుకు చెందిన సుల్తాన్‌బాషా, సుమన్‌కుమార్, ముస్తాక్, లతీఫ్ కారులో గంజాయిని తరలిస్తున్నారని గుర్తించారు. కారులో సుమారు ఆరు కిలోల గంజాయి లభించడంతో తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి సమక్షంలో స్వాధీనం చేసుకొని నిందితులపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ : రూ.120
లేయర్ : రూ.123
బ్రాయిలర్ చికెన్ : రూ.220
స్కిన్‌లెస్ చికెన్ : రూ.242
లేయర్ చికెన్ : రూ.210

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి: రూ.40
సన్నవి: రూ.25
పండ్లు: రూ.10

మా అందర్నీ జైల్లో వేయండి

- ఊరొదిలెళ్లం.. ప్రభుత్వం హింసిస్తోంది సార్
- సబ్ కలెక్టర్‌కు విన్నవించిన రామకృష్ణాపురం వాసులు



ఉప్పరపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న హిమవంశీ

ఉలవపాడు: అయ్యా మేము ఊరొదిలెళ్లం.. మీ ప్రభుత్వం మమ్మల్ని హింసిస్తోంది.. పోలీసులు అర్ధ రాత్రి వచ్చి భయపెట్టి అరెస్ట్ చేస్తున్నారు.. కుట్రతో జైలుకూ పంపారు.. ఈ ప్రభుత్వం చేసిన అవమానాలు చాలు.. ఇంకా ఎంతమందిని జైలుకు పంపిస్తారో పంపండంటూ రామకృష్ణాపురం మహిళలు సబ్ కలెక్టర్ హిమవంశీకి తమ గోడును వెళ్లబోసుకున్నారు. రామకృష్ణాపురం, ఉప్పరపాలెంలో శనివారం పర్యటించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం మహిళలు తమ ఆవేదనను తెలియజేశారు. ప్రభుత్వం దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని తెలిపారు. ఇప్పుడు వంద మంది మాట్లాడుతున్నాం.. అందర్నీ జైల్లో వేయండన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాల్సిన సర్కార్ అందుకు భిన్నంగా ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. భూములివ్వమని తెలియజేసినందుకు ఇంతలా ఇబ్బందులు పెడతారానని ప్రశ్నించారు.

సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా..

సమస్యలు తెలుసుకోవాలనే తానొచ్చానని సబ్ కలెక్టర్ తెలిపారు. ఎంత మందికి ఉద్యోగాలు అవసరమవుతాయి.. కుటుంబాల వివరాలపై సర్వే చేస్తున్నామే తప్ప భూములు తీసుకోవడానికి కాదని చెప్పారు. ఇష్టం ఉండి భూములిస్తే తీసుకుంటామని, అది వేరే సంగతని పేర్కొన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పారు. మాకు సర్వేలొద్దు.. మీరు మాకేదైనా సాయం చేయాలనుకుంటే ఏమీ వద్దు.. ప్రశాంతంగా ఉన్నాం.. ఇక్కడికి వదిలేయండంటూ మహిళలు పేర్కొన్నారు.

పరిహారం తక్కువగా ఉంది..

భూ సేకరణ జరుగుతుందని కలెక్టర్ ఆనంద్ తెలిపారని ఉప్పరపాలెం ప్రజలు పేర్కొన్నారు. ఒక కుటుంబానికిచ్చే పరిహారం చాలా తక్కువగా ఉందని, ఇలా అయితే తమ భూములు, ఇళ్లను ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఒక్కో కుటుంబానికి రూ.ఆరు లక్షలను ఇస్తామంటున్నారని, దీన్ని రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లేడీ డాన్‌గా చిత్రీకరించారు

- దందాలు, నేరాలతో సంబంధాల్లేవు
- ముగిసిన అరుణ పోలీస్ కస్టడీ
- ఒంగోలు జైలుకు తరలింపు



విచారణ అనంతరం బయటకొస్తున్న అరుణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: నేనో సాధారణ మహిళను.. నేరాలతో నాకెలాంటి సంబంధం లేదు.. లేడీడాన్ అంటూ మీడియా చిత్రీకరించింది.. అన్ని సక్రమంగా జరిగి ఉంటే శ్రీకాంత్‌ను పెళ్లి చేసుకొని హాయిగా జీవించే వాళ్లం.. మా బాగోగులన్నీ అధికార పార్టీ నేతలే చూసుకునే వారని పోలీస్ కస్టడీలో అరుణ వెల్లడించారని తెలిసింది. మూడు రోజుల కస్టడీలో భాగంగా కేంద్ర కారాగారం నుంచి కోవూరు పోలీస్‌స్టేషన్‌కు ఆమెను పోలీసులు శనివారం తరలించారు. ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య, నెల్లూరు రూరల్, ఒంగోలు డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, రాయపాటి శ్రీనివాసరావు అనేక ప్రశ్నలను సంధించగా, ఎక్కువ సమాధానాలను దాటేశారని తెలుస్తోంది. ఆమె గతం, ప్రస్తుతం, ఆర్థిక లావాదేవీలు, రాజకీయ నేతలు, అధికారులతో సంబంధాలు, శ్రీకాంత్‌తో ఉన్న అనుబంధం, అతని గ్యాంగ్‌తో ఏమైనా నేరాలు చేశారా.. ఇలా పలు విషయాలపై ఈ మూడు రోజుల్లో దాదాపు 90 ప్రశ్నలు సంధించారని సమాచారం. తన చెల్లెలు ఓ విద్యాసంస్థలో ఏటగా పనిచేస్తున్నారని, ఆమెకు వస్తున్న జీతం, తనకు కుటుంబం ద్వారా సంక్రమించిన ఆస్తితోనే బతుకుతున్నామని ఆమె వెల్లడించారని తెలిసింది. ప్రకాశం జిల్లాలో జరిగిన వీరయ్యచౌదరి హత్య కేసు నిందితుల్లో ఏమైనా సంబంధాలున్నాయానని ప్రశ్నించారని తెలుస్తోంది. జగదీష్ విషయంలో సామాజికవర్గంతో భేదాభిప్రాయాలొచ్చాయని చెప్పారని తెలిసింది. అనేక ప్రశ్నలకు సమాధానం దాటేయడంతో, కస్టడీకీ మరోసారి ఆమెను తీసుకునే అవకాశం ఉందని సమాచారం. మూడు రోజుల విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని నెల్లూరు రూరల్ డీఎస్పీ వెల్లడించారు. పోలీస్ కస్టడీ శనివారం సాయంత్రంతో ముగియడంతో ఆమెకు వైద్యపరీక్షలు చేయించి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. అనంతరం ఆమెను ఒంగోలు కేంద్ర కారాగారానికి తరలించారు.

బాణసంచా ఘటన నీరుగార్చేందుకు యత్నం

- అప్పసముద్రం గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్న బాణసంచా ఘటనతో ప్రమేయమున్న నిందితులను కాపాడేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అనుచరులు యత్నిస్తున్నారంటూ ఆందోళనను గ్రామస్తులు శనివారం చేపట్టారు. దర్యాప్తు చేస్తున్న పోలీసులపై ఒత్తిడి తెచ్చి నీరుగార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. నడింపల్లికి చెందిన టీడీపీ నేత మద్దినేని విజయమ్మ.. ఎమ్మెల్యేకు సమీప బంధువు కావడంతో బాణసంచా ఘటనతో సంబంధం ఉన్న వ్యక్తులను కాపాడేందుకు చూస్తున్నారని తెలిపారు. గ్రామంలో కొన్నేళ్లుగా మద్యం విక్రయాలను విజయమ్మ సాగిస్తున్నారని, దీన్ని అడ్డుకోవడంతో మనస్సులో పెట్టుకొని అధికార పార్టీ అండదండలతో తమపై వేధింపులు, దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆరోపించారు. నిమజ్జన సమయంలో బాణసంచా పేల్చొద్దని కోరినా, ఆమె ప్రోద్బలంతో కాల్చడంతో ఘటన చోటుచేసుకుందని చెప్పారు. గాయపడిన చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారిందని, శరీరమంతా కాలిపోయి వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. ఘటనను ఎమ్మెల్యే సీరియస్‌గా తీసుకొని, ప్రమేయమున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పోలీసులకు ఆదేశాలివ్వాలని కోరారు. కేసు నీరుగార్చేందుకు విజయమ్మ సమీప బంధువు వెంకట్ పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆరుగురు చిన్నారులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.



చికిత్స పొందుతున్న చిన్నారులు

వీరిలో ఎక్కువ మంది బాలికలే ఉన్నారు. వీరి శరీర భాగాలు చాలా వరకు కాలిపోయాయి.

అస్తిత్వవాద సాహిత్యంపై సదస్సు



బహుజనగణమన పుస్తకావిష్కరణ

నెల్లూరు(బృందావనం): వ్యావహారిక భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని నగరంలోని పురమందిరంలో తెలుగు భాషోత్సవాలను సేవ తెలుగు భాషా, సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అస్తిత్వవాద సాహిత్యంపై సదస్సును రెండో రోజు శనివారం నిర్వహించారు. సభకు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ రచించిన బహుజనగణమన వచన కావ్యాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ మాట్లాడారు. సామాజిక న్యాయ ప్రాతిపదికన దేశాన్ని శాంతియుత పద్ధతుల్లో పునర్నిర్మించడమే అస్తిత్వ ఉద్యమాల లక్ష్యమని చెప్పారు. కథా రచయిత్రి ప్రతిమ, డాక్టర్ షమీవుల్లా, డాక్టర్ జయప్రద, సేవ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, డాక్టర్ రేవూరు అనంతపద్మనాభరావు, డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ తదితరులు గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన పలువురు కవులతో కవితోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు సాహిత్య సౌరభాలు సాహితీ రూపకాన్ని ప్రదర్శించారు. మహిళా సదస్సును ఏర్పాటు చేశారు.

నిమజ్జనంలో అపశ్రుతి

- కాలువలో మునిగి వ్యక్తి మృత్యువాత



విగతజీవిగా దయాకర్‌రెడ్డి

కలిగిరి: వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని తూర్పుగుడ్లదొనలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహ నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. కాలువలో ప్రమాదవశాత్తూ మునిగి వ్యక్తి మరణించారు. బంధువుల వివరాల మేరకు.. నిమజ్జనం నిమిత్తం విగ్రహాన్ని కొత్తపల్లిలోని కావలి కాలువకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో దేవరపల్లి దయాకర్‌రెడ్డి (55)తో పాటు మరో ఇద్దరు బైక్‌పై అక్కడికి చేరుకున్నారు. కాలువలోకి దిగి నీటిలో మునుగుతున్న సమయంలో కాళ్లకు లుంగీ చుట్టుకుంది. దీంతో ఆయన మునిగి ఊపిరాడక మృతి చెందారు. వెనుక వాహనంలో వస్తున్న గ్రామస్తులు కాలువలోకి దిగి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి భార్య, కుమారుడున్నారు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

లారీ చక్రాల కింద నలిగిన ప్రాణం

- హమాలీ మృతి



కొడవలూరు: లారీ చక్రాల కింద నలిగి గిరిజన హమాలీ మృతి చెందిన ఘటన మండలంలోని చంద్రశేఖరపురం వేర్ హౌస్‌ల వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. చంద్రశేఖరపురంలోని గిడ్డంగుల్లో హమాలీగా మండలంలోని కమ్మపాళెం మజరా గుర్రాలదిన్నెకు చెందిన యాకాసిరి శ్రీనివాసులు (50) పనిచేస్తున్నారు. గిడ్డంగుల్లో లారీకి లోడింగ్ ఉందనే సమాచారంతో ఇంటి నుంచి మోపెడ్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఖాళీ లారీ మరో వరుసలోకి మారే క్రమంలో వేగంగా వస్తూ మోపెడ్‌ను ఢీకొంది. కిందపడిన ఆయనపై లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న ఎస్సై కోటిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. రిత్విక్ ఎన్‌క్లేవ్ సమీపంలోని రైలు పట్టాల సమీపంలో నివాసం ఉంటున్న రసూల్ (23) నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాన్ క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మద్యానికి బానిసైన ఆయన మత్తులో పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అతనిపై అలిగి రాజుపేటలోని పెద్ద కుమార్తె మస్తానమ్మ ఇంటికి తల్లి నాలుగు రోజుల క్రితం వెళ్లారు. ఈ క్రమంలో వినాయక విగ్రహాలను చూసి బీవీనగర్‌లోని రెండో అక్క కామాక్షి ఇంటికి చెల్లెలు శిరీషా, సోదరుడు సాయికృష్ణ శుక్రవారం రాత్రి వెళ్లారు. ఈ క్రమంలో రసూల్‌కు అక్క కామాక్షి ఫోన్ చేసి ఇంటికి పిలిచారు. వస్తానని చెప్పినా ఆయన వెళ్లలేదు. సోదరుడి ఇంటి వద్దకు శనివారం రాగా, తలుపు లోపల గడియవేసి ఉండటంతో నిద్రిస్తున్నాడని భావించి పనికెళ్లారు. అనంతరం తిరిగి రాగా, తలుపు వేసే ఉండింది. పక్కనే ఉన్న కిటికీ నుంచి చూడగా, సీలింగ్‌కు ఉన్న ఇనుప పైప్‌కు చీరతో ఉరేసుకొని ఉండటాన్ని గమనించారు. స్థానికుల సాయంతో తలుపులు పగలగొట్టి వెళ్లగా, అప్పటికే రసూల్ మృతి చెంది ఉన్నారు. కామాక్షి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పోలీసుల సమక్షంలో రికార్డింగ్ డ్యాన్స్

- టీడీపీ నేత నిర్వాకం
- జనరేటర్‌కు చున్నీ తగిలి.. కిందపడటంతో డ్యాన్సర్‌కు గాయాలు



ఉలవపాడు: వినాయక చవితి నేపథ్యంలో రికార్డింగ్ డ్యాన్స్‌ను ఉలవపాడులో పోలీసుల సమక్షంలో టీడీపీ నేత నిర్వహించారు. అధికారం అండతో స్థానిక గంగమిట్టలోని వినాయకుడి గుడి ధర్మకర్తగా ఉన్న టీడీపీ నేత.. చిలకలూరిపేటకు చెందిన ఎనిమిది మంది యువతులను తీసుకొచ్చి ట్రాక్టర్‌పై గ్రామమంతా తిరుగుతూ డ్యాన్స్ నిర్వహించేలా ఏర్పాటు చేశారు. దీనిపై కాలనీకి చెందిన కొందరు కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి నాలుగు రోజుల క్రితమే ఫిర్యాదు చేసినా, పోలీస్ శాఖ ఏ మాత్రం పట్టించుకోలేదు. పోలీస్ వాహనంలో ఖాకీలు వచ్చి దగ్గరుండి డ్యాన్స్‌ను నిర్వహించారు. ఈ క్రమంలో కోనేరు వద్దకు ట్రాక్టర్ వచ్చేసరికి ఓ డ్యాన్సర్ చున్నీ జనరేటర్‌కు తగిలింది. దీంతో తీవ్రగాయాలతో స్పృహ తప్పి పడిపోయారు. స్థానికంగా ఉన్న సరయూ వైద్యశాలకు వెంటనే తరలించారు. రికార్డింగ్ డ్యాన్స్‌లపై నిషేధం ఉన్నా.. డీజేకు అనుమతి లేకపోయినా సదరు టీడీపీ నేత తాను డ్యాన్స్ పెడతానని ముందే ప్రకటించి ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిందని ఎస్సై అంకమ్మకు స్థానికులు ఫోన్ చేయడంతో దీన్ని నిలిపేయించారు.